క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో అరవింద విద్యార్థుల ప్రతిభ



గూడూరు: హనుమకొండలోని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరుగా నిర్వహించిన ఒలంపియాడ్ మాథ్స్, సైన్స్ పోటీల్లో గూడూరులోని అరవింద విద్యాలయ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అరవింద విద్యాలయంలో కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లు పింగిళి భవాని, భూక్య నాగరాజు, నీలం అనిల్, బత్తుల దేవిక, మమత, అనితను అభినందించారు.

చేయూత

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలో ఇటీవల బాదావత్ శంకర్ మృతి చెందాడు. ఈ మేరకు అదే తండాకు చెందిన హెల్పింగ్‌హ్యాండ్స్ అనే వాట్సాప్ గ్రూపు సభ్యులు రూ.20వేల విలువైన నిత్యావసర సరుకులతోపాటు బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో బాదావత్ యుగేందర్, మౌనిక, అమ్మి, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మరిపెడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరిపెడకు చెందిన వలక సమంత యాదవ్‌కు మరిపెడ మండల యాదవ సంఘం పక్షాన చికిత్స నిమిత్తం రూ.12,500 అందజేశారు. కార్యక్రమంలో రేఖ అశోక్‌యాదవ్, రమేష్‌యాదవ్, వెంకన్నయాదవ్, ఊడుగుల రాజు యాదవ్, మారబోయిన రమేష్, మట్టిపల్లి సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారరథం ప్రారంభం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ.. కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను జిల్లాతోపాటు వివిధ జిల్లాల్లో అతికించేందుకు తయారు చేసిన రథాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలి’

మహబూబాబాద్: ఆరోగ్యశాఖ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. అర్హత లేని వ్యక్తులతో ల్యాబ్, మెడికల్ షాపులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులు నిర్వహించని ఆస్పత్రులను సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సేవాలాల్ జయంతి వేడుకలు



తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ.. నేటి తరం యువతి, యువకులు సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పార్వతి, వాల్య, రవీందర్‌రెడ్డి, సునీల్, శాంతికుమార్, సుజాత, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాపన్న జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

దంతాలపల్లి: మొగల్ రాజులను ఎదిరించిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని మండల గీతకార్మిక సంఘం నాయకులు కోరారు. మండలకేంద్రంలో గురువారం గీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగానే స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్‌లో సీట్లు కేటాయించాలన్నారు. బడ్జెట్‌లో గీత కార్మికులకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గుండగాని లింగయ్య, గునిగంటి మోహన్, కొత్త అంతయ్య, మహేష్, యాకన్న, కొత్త కొమురవెల్లి, మల్లేశం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పరేషాన్

- రెండు చోట్ల బస్సులు నిలుపుతున్న వైనం
- సెంటర్లో ఆగని వరంగల్, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు
- బస్టాండ్‌కు వెళ్లని సూర్యాపేట బస్సులు



అంబేడ్కర్ కూడలిలో ఆగిఉన్న సూర్యాపేట వెళ్లే బస్సు

దంతాలపల్లి: మండలకేంద్రంలో రెండు చోట్ల బస్సులు ఆపుతుండడంతో ఎక్కడ బస్సు ఎక్కాలో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఉన్నా.. సుమారు కిలోమీటర్ వరకు దూరం ఉండడంతో గతంలో బస్సులన్నీ అంబేడ్కర్ కూడలిలోనే ఆపేవారు. దీంతో పాదచారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తేవి. ఈ పరిస్థితులను తట్టుకోలేక ప్రజలు, ప్రయాణికులు బస్టాండ్‌లోనే బస్సులు ఆపాలని నిరాహార దీక్ష చేశారు. దీంతో ప్రజల కోరిక మేరకు కొంతకాలం నుంచి బస్సులు బస్టాండ్‌లోనే ఆపుతున్నారు. కానీ, ఇక్కడే ప్రయాణికులకు పెద్ద సమస్యగా వచ్చింది. వరంగల్, తొర్రూరు వైపు నుంచి ఖమ్మం, విజయవాడ, తిరుపతి వైపు వెళ్లే బస్సులు అంబేడ్కర్ కూడలిలో ఆపడంలేదు. సూర్యాపేట వైపు వెళ్లే బస్సులు బస్టాండ్‌కు వెళ్లకుండా అంబేడ్కర్ సెంటర్ నుంచి మాత్రమే వెళ్తున్నాయి. దంతాలపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులు తొర్రూరు, వరంగల్ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో బస్సుల కోసం చూస్తుంటే సూర్యాపేట వైపు నుంచి తొర్రూరు, వరంగల్ వెళ్లే బస్సులు మిస్ అవుతున్నాయి. సెంటర్‌లో బస్సుల కోసం చూస్తే ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపు వెళ్లే బస్సులు మిస్ అవుతున్నాయి. దీంతో ఎక్కడ బస్సు కోసం వేచి ఉండాలి.. ఎక్కడ బస్సు ఎక్కాలో తెలియక ప్రయాణికులు పరేషాన్ అవుతున్నారు. సూర్యాపేట బస్సులు కూడా బస్టాండ్‌లోనే ఆపాలని ఆర్టీసీ సిబ్బందిని ప్రయాణికులు కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాలు లేవని సమాధానమిస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రయాణికులు తెలుపుతున్నారు.

బస్టాండ్‌లోనే బస్సులు ఆపాలి



ఖమ్మం, వరంగల్, సూర్యాపేట వైపు వెళ్లే ప్రతి బస్సును బస్టాండ్‌లోనే నిలపాలి. అలా చేయడంవల్ల ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– సేను రాజేశ్, సామాజిక కార్యకర్త

మార్చి 6 వరకు అండర్ బ్రిడ్జి మరమ్మతులు



అండర్ బ్రిడ్జిలో కొనసాగుతున్న పనులు

మహబూబాబాద్ రూరల్ : రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని అండర్ బ్రిడ్జి ప్రాంతంలో జరుగుతున్న మరమ్మతు పనులు మార్చి 6వ తేదీ వరకు పూర్తవుతాయని సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. జనవరి 29వ తేదీ సాయంత్రం నుంచి పట్టణంలోని అండర్ బ్రిడ్జిలో వాహనాల రాకపోకలను అధికారులు నిలివేశారు. సుమారు నెల రోజుల్లోగా పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల పనుల్లో జాప్యం జరుగుతుండటంతో మరో పదిహేను రోజులపాటు గడువు పొడగించినట్లు వెల్లడించారు. సిమెంట్ పిల్లర్ల నిర్మాణాలు, స్లాబ్ నిర్మాణం వేగవంతం చేసి, ట్రాక్ నిర్మాణం పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

ప్రజల నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

డోర్నకల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహించిన అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న పులి సరోత్తంరెడ్డిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు కాపరబోయిన సత్యనారాయణ, మహేష్‌గౌడ్, గణేష్‌నాయక్, దేవానాయక్, రెహమాన్, లక్ష్మీనారాయణ, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య సూచించారు. మండలంలోని మడిపెల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం తీరును, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన విద్యాతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాటి కాయల సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు ఇల్లందు రోడ్డులో గురువారం పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు సర్వే నిర్వహించారు. బాధితులు మాత్రం అలైన్‌మెంట్ మార్చాలని అధికారులతో వాగ్వాదం చేశారు. కొంతమంది బాధితులు కోర్టుకు వెళ్లి సమస్య పరిష్కరించుకుంటామని వెళ్లిపోగా మరికొందరు అధికారులకు సహకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఎన్‌హెచ్ ఏఈ మదన్, ఆర్‌ఐ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలతో సంపూర్ణ ఆరోగ్యం

- డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

గార్ల: సాధారణ ప్రసవాలతో మహిళల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యాధికారి రాజ్‌కుమార్‌జాదవ్ సూచించారు. మండలంలోని ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సాధారణ ప్రసవాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో డబ్బులకు కక్కుర్తి పడి గర్భిణులకు పెద్ద ఆపరేషన్లు చేస్తారని, ఈ ఆపరేషన్లతో మహిళలు ఎక్కువగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు గర్భిణులు చిన్న వ్యాయమాలు, యోగా చేయాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా ఎటువంటి మందులు వాడకూడదని తెలిపారు. రేడియేషన్, ఎక్స్‌రేలకు దూరంగా ఉండాలని, లేదంటే పుట్టే బిడ్డలు అంగవైకల్యంతో జన్మిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, స్టాఫ్‌నర్సులు వినోద, శోభ, ఫార్మసిస్ట్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న పార్టీ నాయకులు

తొర్రూరు: రబీపంట సాగుకు కొరత లేకుండా యూరియాను సరిపడ అందించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో పలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కొత్తపెల్లి రవి మాట్లాడుతూ.. గత కొన్నిరోజులుగా యూరియా కొరత ఉండడం ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముంజంపెల్లి వీరన్న, సెగ్గెం యాకయ్య, వెంకటయ్య, యాకయ్య, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఉక్కుపరిశ్రమ పనులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

బయ్యారం: ఇనుప రాతిగనులు ఉన్న బయ్యారంలో ఉక్కుపరిశ్రమ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా నాయకులు మండా రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కుపరిశ్రమకు అన్ని వనరులు స్థానికంగా అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు మధు, నాగేశ్వరరావు, చంటి, వెంకన్న, యాకూబ్, ఆనందరావు, మోహన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

108 వాహనానికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న సిబ్బంది

డోర్నకల్: మండలానికి కొత్త 108 వాహనాన్ని కేటాయించగా గురువారం డోర్నకల్‌కు చేరుకున్న వాహనానికి 108 సిబ్బంది ఎస్‌కె సైదులు, ఎల్.శ్రీనివాస్, షమీమా, నవీన్ పూజలు నిర్వహించి వాహనాన్ని ప్రారంభించారు.

నియామకం



రాజమ్మకు నియామకపత్రం అందజేస్తున్న రాధ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అనంతుల రాజమ్మను నియమిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు రాధ వెల్లడించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ విజయ్



సబ్ స్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఈ విజయ్

మహబూబాబాద్ రూరల్ : అంతరాయంలేని విద్యుత్ సరఫరాకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్ అన్నారు. విద్యుత్ శాఖ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మహబూబాబాద్ రూరల్ సెక్షన్ పరిధిలోని జంగిలిగొండ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గ్రామంలో ఆయన గురువారం తనిఖీలు నిర్వహించారు.

వినియోగదారులకు అవగాహన

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీలో విద్యుత్ వినియోగదారులకు.. విద్యుత్ వలన జరిగే ప్రమాదాలపై విద్యుత్‌శాఖ డీఈ విజయ్‌కుమార్ గురువారం అవగాహన కల్పించారు. తడి చేతులతో మోటార్‌ను స్టార్ట్ చేయొద్దని, దుస్తువులను ఆరవేసేందుకు జీవైర్(ఇనుప)కాకుండా ప్లాస్టిక్ తాడును వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

నెహ్రూసెంటర్: డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ నరేష్ గురువారం తెలిపారు. నిరంతర సరఫరా, ముందస్తు ప్రణాళిక సిద్ధ చేసుకుని లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా 43 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 41 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

పాఠశాలకు ప్యూరిఫయర్ అందజేత

దంతాలపల్లి: మండలంలోని రామానుజపురం గ్రామ ప్రాథమిక పాఠశాలకు స్థానిక మాజీ సర్పంచ్ ఒల్లాద్రి రమేష్‌రెడ్డి రూ.20 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశుభ్రమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో పాఠశాలకు ప్యూరిఫయర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సఫియాబేగం, ఉపాధ్యాయుడు రఘు, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, మధు, తోట శ్రీను, యాకయ్య, రాంమ్మూర్తి, ప్రదీప్‌రెడ్డి, నాగేష్, అర్జున్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్ : గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఆర్టీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టం శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన శాఖ కార్యాలయంలో గురువారం గిరిజన శాఖ ఏసీఎంఓ ధరావత్ రాములు నాయక్ సీఆర్టీలు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ అరుణ్ కుమార్, నాయకులు బానోత్ కిషన్, భూక్య మంగీలాల్, గుగులోత్ చిట్టి బాబు, బానోతు రవీందర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

గార్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రూ.2 కోట్ల వ్యయంతో నాడు గార్లలో డిగ్రీ కళాశాల నిర్మించారన్నారు. కళాశాల ఊరి చివరన ఉండడం, ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు, మూగ జీవాలు కళాశాల ఆవరణంలో తిరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



తొర్రూరు: పట్టణంలోని ఎల్‌వైఆర్ గార్డెన్ రోడ్డులో గురువారం ఉదయం కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం మత్తులో కారు అతివేగంగా నడుపుతున్న యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించగా కారులో ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేసినట్లు తెలిసింది.

కొనసాగుతున్న జాతర పనులు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల పనులు కొనసాగుతున్నాయి. గురువారం స్వామివారి కల్యాణ వేదికకు రంగులు వేయడం, బారికేడ్ల నిర్మాణం ఆలయ ఈఓ సత్యనారాయణ దగ్గరుండి చేయించారు. కల్యాణ వేదిక వద్ద విద్యుత్ తీగల ఏర్పాటును విద్యుత్‌శాఖ అధికారులు చేపట్టారు.

ప్రశ్నించే వారిని గెలిపించాలి

కొత్తగూడ: చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకురాలు స్వరూప కోరారు. మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. బీజేపీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి మురళి, మధు, రవి, ప్రవీణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పోటీతో విద్యార్థుల ప్రతిభ గుర్తింపు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తొర్రూరు రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడ, కళాపోటీలు దోహదపడుతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వాడపెల్లి వెంకన్న అన్నారు. డివిజన్ కేంద్రంలోని సమత డిగ్రీ కళాశాలలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నవయుగ విజన్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు బానోతు వీరన్ననాయక్, రామకృష్ణ, హరీశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8 మందిపై కేసు నమోదు

నెల్లికుదురు: ఓ వ్యక్తి మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. గురువారం ఎస్సై మాట్లాడుతూ.. నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామ శివారు కట్టు కాలువ తండాకు చెందిన జాటోతు రెడ్యా (27) ఈ నెల 19న తండాకు చెందిన ధరంసోత్ రెడ్యా, బీకు, గుగులోతు రాజు, సోమ్లా, మోహన్, బాదావత్ తిరుమలేష్, జాటోతు నర్సింహ, నానుతో కలసి ఆకేరు వాగులో విద్యుత్ షాక్‌తో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈక్రమంలో జాటోతు రెడ్యా వాగులో ఉండగా విద్యుత్ ప్రసారం చేయడంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తొర్రూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో మృతుని భార్య జాటోతు మమత ఫిర్యాదుతో మృతికి కారణమైన 8మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై సీలింగ్ విధించడం సరికాదంటూ, గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్ ప్రాథమిక పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.